# సిద్ధరామయ్యపై విచారణ జరపండి..

బెంగళూరు, ముడా భూముల కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరపాలని లోకాయుక్త పోలీసులను ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు మేరకు సిద్ధరామయ్యపై విచారణ ప్రారంభించాలని పేర్కొన్నది. ఆయనపై సీఆర్పీసీ సెక్షన్ 156(3) కింద కేసు నమోదు చేయాలని ఆదేశించింది. డిసెంబర్ 24 లోగా విచారణ నివేదికను కోర్టుకు అందజేయాలని పోలీసులకు సూచించింది. కాగా, ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యపై విచారణకు ఆగస్టు 16న గవర్నర్ అనుమతించిన సంగతి తెలిసిందే. ఈ అనుమతిని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య హైకోర్టును ఆశ్రయించగా.. ఆయన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు కొట్టేసింది. సిద్ధరామయ్యపై విచారణ జరపొచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి ముడా కేటాయించిన 14 స్థలాల్లో అవకతవకల ఆరోపణలపై లోకాయుక్త పోలీసులు విచారణ ప్రారంభించనున్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :189 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 27-09-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఇన్నోవేటివ్ థింకింగ్ అంటే ఏమిటి..? రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్ : ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధపు పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వ జమెత్తారు. ఏ ఒక్క కొత్త పథకం కానీ, ప్రాజెక్టును ప్రారంభించకుండా.. ఇచ్చిన హామీలను మరిచి ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఉద్దేశించి.. ఇన్నోవేటివ్ థింకింగ్ అంటే ఏమిటి..? అని కేటీఆర్ ప్రశ్నించారు.ఎన్నికలకు ముందు ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చిన తర్వాత మాట తప్పడం. దేవుళ్ళ మీద ఒట్టేసి వారికి కూడా శఠగోపం పెట్టడం.. ఇన్నోవేటివ్ థింకింగా అని ప్రశ్నించారు. నూరు రోజులు, ఆరు గ్యారెంటీలు అని ఊదరగొట్టి తర్వాత వాటిని మర్చిపోవడం, ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రతిరోజూ ఒక కొత్త డ్రామా సృష్టించి, హెడ్ లైన్ మేనేజ్‌మెంట్ చేయడం. గత ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాలు మనమే ఇచ్చినట్టు బిల్డప్ ఇవ్వడం. గతంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కట్టలేదు అని చిల్లర మాటలు మాట్లాడి, ఇప్పుడు పదిహేను వేల డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మనమే కట్టినట్టు ఫోజులు కొట్టడం ఇన్నోవేటివ్ థింకింగా అని కేటీఆర్ అడిగారు.అర్హతలు లేని బావమరిది కంపెనీకి వేల కోట్ల ప్రజా సొమ్ము కట్టబెట్టడం. కుటుంబపాలన అని విమర్శించి, ఇదివరకు అడ్రస్ లేని తన అన్నదమ్ముళ్లు వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నారు మభ్యపెట్టడం. తెలంగాణ తల్లికి కేటాయించిన ఢిల్లీ బాసులకు దారాదత్తం చేయటం. ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం, తర్వాత చేరలేదని బుకాయించడం. ఫార్మా సిటీ రద్దు అని బయట చెప్పడం, హైకోర్టులో మాత్రం రద్దు చేయలేదని న్యాయమూర్తులను కూడా మోసం చేయడం. ఇష్టారీతిన పేదల ఇండ్లు కూల్చడం, బ్రదర్ ఇల్లు మాత్రం ముట్టకపోవడం.. ఇవన్నీ ఇన్నోవేటివ్ థింకింగా అని కేటీఆర్ అడిగారు. ఇంకా చాలా ఉన్నాయ్ చెప్పాలి అంటే అని కేటీఆర్ గురించి.

రెండు చీరలు ఇస్తానన్న ముఖ్యమంత్రి ఏమై పోయావ్.. బతుకమ్మ చీరల బంద్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్: బతుకమ్మ చీరల పంపిణీని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కేటీఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్తమీద కోపం దుత్త మీద తీర్చినట్లుగా ముఖ్యమంత్రి వ్యవహారం ఉందని. మా మీద కోపం ఆడబిడ్డల మీద చూపిస్తున్నారని ఫైరయ్యారు. తెలంగాణ ఆడబిడ్డల అపురూప వేడుక బతుకమ్మ పండుగ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలకు కేసీఆర్ సర్కార్ పుట్టింటి నుంచి చీర పంపినట్లు చెప్పారు. వారి సంతోషంలో భాగం అయ్యేదని.ఆడబిడ్డలకు ఇంకా గొప్పగా ఇవ్వాలి అనుకుంటే ఇవ్వండి స్వాగతిస్తాం.. అంతే కానీ ఇచ్చేది కూడా ఆపేస్తే ఎలా అని ప్రశ్నించారు. లక్షల కోట్ల బడ్జెట్ పెట్టుకునే తెలంగాణ ప్రభుత్వం.. ఆడబిడ్డలకు ఇచ్చే చీరలు కూడా ఇవ్వలేదా అని నిలదీశారు. రెండు చీరలు ఇస్తానన్న ముఖ్యమంత్రి ఏమై పోయావ్ అంటూ ఎక్స్' వేదిగా దుయ్యబట్టారు.

## తెలంగాణలో బుల్డోజర్ సెగలు.. ప్రభుత్వంపై విపక్షాల ఫైర్

హైదరాబాద్,అక్రమార్కులను హడలెత్తిస్తోన్న హైడ్రా, ఇప్పుడు సూపర్ పవర్. ఇప్పటికే తెలంగాణ కేబినెట్ హైడ్రాకు చట్టబద్ధతకల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.. మిషన్ మూసీ ప్రక్షాళనలో హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా హైడ్రాలో కొత్తగా 169 సిబ్బందిని కేటాయించారు. డిప్యుటేషన్‌పై వివిధ విభాగాల్లోని సిబ్బందిని హైడ్రాకు అటాక్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది తెలంగాణ ప్రభుత్వం. నలుగురు అదనపు కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది ఎస్సైలు, 60 మంది కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు సహా సైంటిస్ట్, తహసీల్దార్లు, సర్వేయర్ ,ఫారెస్ట్ ఆఫీసర్‌తో హైడ్రా మరింత బలోపేతమైంది.తిరుగులేని బాణంలా దూసుకెళ్తోన్న హైడ్రా.. ఇప్పుడు మరింత బలోపేతం అవుతుంది. చెరువులు, నాలాలపై కబ్జాల కబ్జాల తొలగింపుకు సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. అయితే, ఆక్రమణలను తొలగించడం మంచిదే.. కానీ సంపన్నుల విషయంలో ఒకలా.. నిరుపేదల విషయంలా మరోలా వ్యవహరిస్తున్నారని కన్నెర్ర చేస్తున్నాయి విపక్షాలు.హైడ్రా పేరుతో హైడ్రామాలు చేస్తున్నారన్నారని ఆరోపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. బాధితులకు బీఆర్ఎస్ అండగా వుంటుందన్నారు. అవసరమైతే బుల్డోజర్‌కు అడ్డుగా తాము నిలబడుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా లీగల్ ఎయిడ్



అందిస్తామన్నారు.హైడ్రా ముసుగులో పేదలపై దుర్మార్గపు చర్యలను ఆపాలన్నారు బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్. లేదంటే ఉద్యమం తరహాలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు తప్పుల చిట్టాను ప్రజల్లోకి తీసుకెళ్తామని ఈటల చెప్పారు.హైడ్రా యాక్టివిటీ హద్దుల్లో ఉండాలంటున్నాయి విపక్షాలు .పర్యావరణ పరిరక్షణే లక్ష్యం.. చెరువులు, నాలాలపై కబ్జాలను తొలగించడమే మార్గం అంటూ హైడ్రాను మరింత స్ట్రెంథెన్ చేస్తోంది సర్కార్. సవాళ్లు -ప్రతిసవాళ్లతో బుల్డోజర్ పాలిటిక్స్ మరింతగా హీటెక్కుతున్నాయి.

## మహారాష్ట్రలో భారీ వర్షాలు ..ప్రధాని పుణె పర్యటన రద్దు



ముంబై,సెప్టెంబర్26: మహారాష్ట్రలో వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో ముంబయి సహా పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైన వేళ శుక్రవారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ప్రధాని మోడి పుణె పర్యటన రద్దయింది. ఇప్పటికే మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ఇచ్చింది. ప్రధాని ఈ రోజు పూణెలికు చేరుకుని అక్కడ రూ. 22 వేల 900 కోట్ల విలువైన పథకాలను ప్రారంభించి, శంకుస్థాపన చేయాల్సింది. దీంతో పాటు పుణె వాసులకు మెట్రో సర్వీస్ ప్రారంభం కావల్సి ఉంది. స్వర్‌గేట్‌ను డిస్టిక్ట్ కోర్ట్‌ను కలిపే భూగర్భ మెట్రోను ప్రధాని మోడి ప్రారంభించాలని ప్లాన్ చేసుకున్నారు. దీంతో పాటు భిడే వాడాలో మరిన్ని ముఖ్యమైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించాల్సి ఉంది. పీఎం మోడీ పర్యటన కోసం, పూణెళి పరిపాలన నుండి ఒక ఉత్తర్వు జారీ చేయబడింది. నది వైపు ప్రాంతం, భిడే వంతెనను పార్కింగ్ కోసం సేకరించారు. దీని కారణంగా ప్రజలు భారీ ట్రాఫిక్‌ను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే భారీ వర్షాల నేపథ్యంలో పుణెలో ప్రధానమంత్రి మోడీ పర్యటన రద్దయింది. ఇకపోతే ముంబైలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కుండపోత వానతో ముంబై అతలాకుతలం అయ్యింది. బుధవారం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. ఈ నేపథ్యంలో గురువారం పుణె, ముంబైలోని విద్యాసంస్థలకు సెలవు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాలను భారీ వరదలు ముంచెత్తాయి. రోడ్లు రహదారులు జలయమయ్యాయి. దీంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.భారీ వర్షాల కారణంగా ముంబ్రా బైపాస్ వద్ద రాత్రి 11.30 గంటల సమయంలో కొండచరియలు విరిగిపడటంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌కు జామ్ అయ్యింది. అగ్నిమాపక అధికారి స్వప్నిల్ సర్నోబత్ మాట్లాడుతూ.. దాదాపు 3 గంటలపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని, ఈ సమయంలో ట్రాఫిక్ విభాగం కూడా ట్రాఫిక్‌ను ఒకవైపు నుంచి నియంత్రించిందని, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని.. రోడ్డుపై రాళ్లను జేసీబీతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు. ఇక, పలు చోట్ల రైలు పట్టాలు నీటిలో మునిగిపోయాయి. దీంతో సబర్బన్ రైళ్లను నిలిపివేశారు. అలాగే, పలు విమానాల దారి మళ్లించారు. రానున్న మరికొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ముంబైకి ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

## హైడ్రాపై తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం!

హైదరాబాద్,చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడడమే లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హైడ్రా పరిధిని పెంచుతూ ఆదేశాలిచ్చిన రేవంత్.. తాజాగా మరింత పవర్స్ ఇచ్చారు. ఇటీవల చట్టబద్ధత కల్పిస్తూ కేబినెట్ డిసైడ్ చేసింది. అలాగే.. పలు అదనపు అధికారాలను ఇస్తూ నిర్ణయించారు. రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్‌ల నుంచి పలు బాధ్యతలను హైడ్రాకు అప్పగించారు.హైడ్రాను మరింత బలోపేతం చేసేందుకు మరో నిర్ణయం తీసుకుంది. అదనపు సిబ్బంది కేటాయిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా కోసం మొత్తంగా 169 మంది సిబ్బందిని కేటాయించింది. నలుగురు అడిషనల్ కమిషనర్లు, ఐదుగురు డీసీపీలు, 16 మంది ఎస్సైలు, 60 మంది కానిస్టేబుళ్లు, 12 మంది స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు డిప్యూటేషన్‌పై పనిచేస్తారు. వారితోపాటే ముగ్గురు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సమాచారం కోసం ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు, అనలైటికల్ ఆఫీసర్, డిప్యూటీ అనలైటికల్ ఆఫీసర్, అసిస్టెంట్ అనలైటికల్ ఆఫీసర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్, జిల్లా అదనపు అగ్నిప్రమాద శాఖ అధికారి, సిటీ ప్లానర్, ముగ్గురు డిప్యూటీ సిటీ ప్లానర్లు, నీటిపారుదల శాఖ ఈఈ, ముగ్గురు డీఈలు, పబ్లిక్ హెల్త్ నుంచి ఇద్దరు డీఈలు,ఆర్థిక శాఖ నుంచి ఒక డిప్యూటీ సెక్రటరీ, డిప్యూటీ కలెక్టర్, ముగ్గురు తహసీల్దార్లు, ముగ్గురు సర్వేయర్లను హైడ్రా కోసం నియమించారు.ఇటీవలే చట్టబద్ధత కోసం ప్రతిపాదించడం.. జీహెచ్ఎంసీ, రెవెన్యూ శాఖల నుంచి అధికారాలు బదలాయింపు కావడం.. తాజాగా సిబ్బందిని



కేటాయించడంతో ఇక హైడ్రా మరింత దూసుకుపోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వందలాదిగా నిర్మాణాలు నేలమట్టం కాగా.. ఎకరాల కొద్దీ భూమిని రికవరీ చేశారు. మొన్నటి వరకు అడపాదడపా ఉన్న సిబ్బందితోనే అంతటా చేసిన హైడ్రా..అదనపు బలగం కూడా తోడవ్వ డంతో.. ఇక ఆ దూకుడు ఏ స్థాయిలో ఉంటుందోనని అక్రమార్కుల్లో భయం పెరిగిపోయింది.మరోవైపు.. ఇప్పటికే హైడ్రా విషయమై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. పెద్దోళ్లను వదిలి పేదలను గుడిసెలను కూల్చుతున్నారని, వారి ఆస్తులను బుగ్గి చేస్తున్నారని అంటున్నారు. పేదలు ఏడుస్తున్నా ప్రభుత్వం ఆపడం లేదని కామెంట్లు చేస్తున్నారు.ప్రతిపక్ష పార్టీలు, కొంత మంది ప్రజల నుంచి ఇలాంటి ప్రచారం జరుగుతుంటే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రేవంత్ రెడ్డి రోజురోజుకూ మరింత బలోపేతం చేస్తుండడం గమనార్హం.

## రిజర్వేషన్లు రద్దు చేసేందుకు బీజేపీ వెనకాడదు..

న్యూఢిల్లీ,కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేసేందుకు కాషాయ పార్టీ ఏమాత్రం వెనకాడదన్నారు.ఓ జాతీయ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, రాజ్యాంగం ప్రమాదంలో పడింది..

బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని కాంగ్రెస్ ఎన్నికల ముందు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అడిగిన ప్రశ్నకు పి. చిదంబరం రియాక్ట్ అయ్యారు. రాజ్యాంగంలో బీజేపీ కచ్చితంగా సవరణలు చేస్తుంది. అందుకో సం వారు ట్రై చేస్తున్నారు.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు విఘాతం కలిగిస్తుందని ఆయన ఆరోపించారు.కాగా, డిజిటల్ లావాదేవీలు భారత్ సాధించిన పురోగతిని ఉద్దేశిస్తూ నరేంద్ర మోడీను కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం అభినందించారు. నగదు అవసరం లేకుండా డిజిటల్ విధానంలో పేమెంట్లు కొనసాగుతున్నాయి. ఇది అభినందించదగిన విషయం.. అయితే, జర్మనీ, యూరప్‌లలో పూర్తిగా నగదురహిత సమాజం ఏర్పడలేదు అనే విషయాన్ని గుర్తు చేశారు. పెద్దనోట్ల



రద్దు ప్రకటన నాటికి రూ.16-17 లక్షల కోట్లు చెలామణిలో నగదు ఉంది.. నేడు అది రూ. 34 లక్షల కోట్లకు చేరిపోయిం దన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో డిజిటల్ పేమెంట్‌కు బదులు.. ప్రజలు నగదును వినియోగిస్తున్నారని చెప్పారు. దాన్ని వారి దగ్గర నుంచి దూరం చేయలేమని చిదంబరం పేర్కొన్నారు.

## అధికారులకు షాక్.. అడ్డుకున్న మూసీ ప్రాంతవాసులు



హైదరాబాద్, హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపై అధికారులు రంగంలోకి దిగేశారు. పరివాహక ప్రాంతాల్లో అధికారులు సర్వే చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో 25 టీమ్‌లతో సర్వే చేస్తున్నారు అధికారులు. హైదరాబాద్‌లో 16 , రంగారెడ్డిలో నాలుగు, మేడ్చల్ జిల్లా పరిధిలో ఐదు బృందాలు సర్వే చేస్తున్నాయి.నదీ గర్భంలోని నిర్వాసితుల నిర్మాణాల గురించి వివరాలను సేకరిస్తున్నారు. తొలిసారి సర్వే చేసిన అధికారులు మరోసారి రీ సర్వే చేస్తున్నారు. బాధితుల వివరాలు తీసుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లో మూసీ పరివాహక ప్రాంతాల్లో సర్వే కోసం వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. దిల్‌సుఖ్ నగర్ ఏరియాలోని కొత్తపేట, మారుతినగర్, సత్యానగర్‌లో అధికారులను అడుగు పెట్టనీయలేదు మూసీ నివాసితులు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లను ఖాళీ చేయమంటూ మూసి నివాసితుల కాసింత ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సర్వే మాత్రమేనని, అంతకుమించి మరేమీ లేదని అధికారులు ప్రజలకు విన్నవించినప్పటికీ ఏ మాత్రం అంగీకరించలేదు. పరిస్థితి గమనించిన అధికారులు సర్వే నిర్వహించకుండానే తిరిగి వెళ్ళిపోయారు.మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను రాజకీయ పార్టీలు రెచ్చగొడతాయని కాంగ్రెసర్కార్ ముందుగానే గుర్తించింది. నది అభివృద్ధిలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించేందుకు మూవీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ద్వారా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది.బఫర్ జోన్‌లో ఉంటున్న 15 వేల కుటుంబాలకు రెండు గదుల ఇళ్లను కేటాయించాలని నిర్ణయించింది. బుధవారం అందుకోసం ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. ఆయా ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ప్రజలు జీవిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపాలు చేసుకుంటూ ఉంటున్నారు.నిర్మాణాలు తొలగించే ముందు వారిందరికీ పునరావాసం కల్పించిన తర్వాతే భూసేకరణ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాతే నిర్మాణాలు కూల్చివేస్తామని చెబుతున్నారు.

### మొగిలి ఘాట్ వద్ద రోడ్డు ప్రమాదం..ఇద్దరి మృతి

చిత్తూరు,చిత్తూరు జిల్లా బంగారు పాల్యము మండలం మొగిలి ఘాట్ వద్ద గురువారం వేకువ ఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు.బ్రేక్ డౌన్ అయి ఆగి ఉన్న కొయ్యల లారీని వెనుక భాగం నుంచి మరొక లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. లారీలు ఢీ కొనగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. లారీలోని ఆయిల్ ట్యాంకర్ పేలడంతో మంటలు ఎగిసి పడ్డాయి. ఒక లారీ రహదారి పక్కలోని లోయలో బోల్తా పడింది. లారీ డ్రైవర్ అందులో ఇరుక్కుని దుర్మరణం చెందాడు. మరో లారీ కింద పడుకునే నిద్రిస్తున్న వ్యక్తి మంటల్లో చిక్కుకొని మృతి చెందాడు.విషయం తెలియగానే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. బంగారు పాల్యం పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## దుబ్బాకలో రచ్చ రచ్చ.. మూడు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట



దుబ్బాక:దుబ్బాకలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రచ్చ రచ్చగా మారింది. కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు హాజరయ్యారు.మంత్రితో పాటు స్టేజిపైకి కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి వెళ్లారు. స్టేజీపైకి ఓడిపోయిన వారు రావద్దని, ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ నేతలు ఆగ్రహంతో స్టేజీ పైనే శ్రీనివాస్ రెడ్డి ఉంటాడని ఆందోళన చేపట్టారు. అక్కడ మూడు పార్టీల కార్యకర్తలు పోటా పోటీ నినాదాలు చేపట్టారు. మూడు పార్టీల కార్యకర్తలు నినాదాలు, తోపులాటతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కళ్యాణలక్ష్మి చెక్కుల కోసం వచ్చిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాసేపు ఏం జరుగుతుందో అర్థంకానీ పరిస్థితిలో ఉండిపోయారు. దీంతో అక్కడ నినాదాలు, తోపులాటల మధ్య కార్యకర్తలను పోలీసులు నిలువరించేందుకు తంటాలు పడ్డారు. చివరకు చెరకు శ్రీనివాస్ రెడ్డి స్టేజినుంచి కిందికి దిగి అసహనంతో వెళ్లిపోయారు.

# బీజేపీ ట్రాప్‌లో కేటీఆర్ పడ్డారా?



హైదరాబాద్,అమృత్ టెండర్ల వ్యవహారంలో అధికార పార్టీకి ఎందుకు దొరికిపోయాడు? ఛాలెంజ్ ప్రకారం కేటీఆర్ రాజీనామా చేస్తున్నారా? కేవలం రేవంత్ సర్కార్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారా? పరిణామాలు చూస్తుంటే నిజమేనని అనిపిస్తోంది.తెలంగాణలో అమృత స్కీమ్ టెండర్ల వ్యవహారం అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. టెండర్ల వ్యవహారంలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు కేటీఆర్. అసలు నిజాలు తెలుసుకోకుండా ఏకంగా కేంద్రమంత్రికి సైతం లేఖ రాశారాయన. ఎట్టకేలకు టెండర్ల వ్యవహారంపై క్లారిటీ వచ్చేసింది.కేటీఆర్ పొలిటికల్ కెరీర్ క్లోజ్ అయినట్టేనా? రాజకీయాల్లో సవాల్-ప్రతి సవాళ్లు సహజమేనని సరిపెట్టుకుంటారా?

సింపుల్‌గా చెప్పాలంటే బీజేపీ ట్రాప్‌లో పడి ఇరుక్కుపోయారు కేటీఆర్. నిజాలు తెలుసు కోకుండా అమృత్ టెండర్ల అంశాన్ని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తెరపైకి తెచ్చారు. రేవంత్ సర్కార్‌పై బురద జల్లేందుకు ప్లాన్ చేశారు. కాకపోతే టెండర్ల లోగుట్టు తెలిసి ఆయన సైలెంట్ అయిపోయారు. ఈ వ్యవహారాన్ని కేటీఆర్ అందుకున్నారు.అమృత్ స్కీమ్ టెండర్ల వ్యవహారంపై కేటీఆర్‌ను ఎవరో తప్పుదోవ పట్టించారని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి క్లారిఫికేషన్ ఇచ్చుకున్నారు. టెండర్లకు సీఎం రేవంత్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.తన అల్లుడు సృజన్‌రెడ్డి.. సీఎంకు సొంత బావమరిది కాదని తేల్చేశారు మాజీ ఎమ్మెల్యే కందాల. సృజన్‌కు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. బిజినెస్‌లో జాయింట్ వెంచర్లు సహజమేనని, అమృత్ టెండర్‌లో అదే జరిగిందన్నారు.శోధ కంపెనీలో తన కుమార్తె డైరెక్టరని, అమృత్ టెండర్లలో శోధ కంపెనీకి 29శాతం వాటా ఉందన్నారు. అసలు టెండర్ల విలువ 8 వేల కోట్లు కాదన్నది కందాల మాట. రాజకీయాలు వేరు, వ్యాపారం వేరంటూ కేటీఆర్‌కు చెప్పకనే చెప్పేశారు. మరోవైపు నిబంధనల ప్రకారమే ఆన్ లైన్ ద్వారా టెండర్ దక్కిందని సృజన తండ్రి మనోహర్‌రెడ్డి వెల్లడించారు.మొత్తానికి రేవంత్ సర్కార్‌పై బురద జల్లాలని చూసి కేటీఆర్ అందులో ఇరుకున్నారు. ఆరోపణలు చేయడం ఎవరికైనా సులువే.. నిరూపించడమే కష్టమని ఆయనకూ తెలుసు, అయినా బీజేపీ నేతలు దీన్ని తెరపైకి తెచ్చారంటూ ఈ వ్యవహారం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు.

# ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉల్లిధరలు

హైదరాబాద్,రాష్ట్రంలో ఉల్లి ఘాటు క్రమంగా పెరుగుతోంది. ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. వందరూపాయలకు చేరుకుంటుందని వ్యాపారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. దీంతో కొనుగోళ్లు పెంచుకుంటున్నారు. ఇది నిజమన్నట్లుగా గత నాలుగైదు రోజులుగా కిలోకు ఐదు రూపాయల చొప్పున పెరుగుతోంది. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా 40 నుంచి 65-70కి చేరుకుంది. మార్కెట్‌లోకి వస్తున్న కొద్దిపాటి ఉల్లి ఆయా రాష్ట్రాల అవసరాలకే సరిపోతుండగా మిగతా వాటి కోసం దక్షిణాది రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. ఫలితంగా డిమాండ్ పెరగడంతో ధరలు కూడా అమాంతం పెరుగుతున్నాయి. ఇటీవలి వర్షాల కారణంగా ఉల్లి సరఫరా ఆగిపోయిందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 4-5 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. దీంతో హోల్‌సేల్ ధరే కిలో రూ. 33కి చేరింది. మరోవైపు కర్నూలు జిల్లాలో సైతం మార్కెట్‌లోకి ఉల్లి అంతగా రావడం లేదు. వర్షాల పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరగకపోవడంతో తెలంగాణకు అవసరమైన సరఫరా లేక ధర పెరుగుతోంది. హైదరాబాద్ బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ. 50 మేర ఉండగా ప్రస్తుతం రూ. 65 నుంచి రూ 75కి చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెటింగ్ వర్గాలు అంటున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతోంది. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 మేర పెరిగింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 70 రూపాయలు పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోంది.



సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో అక్కడ దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఇటీవలి వరదల కారణంగా ఉల్లి ధరలు పెరగుతాయన్న సంకేతాల నేపథ్యంలో కేంద్రం ఇప్పటికే 50 వేల టన్నుల ఉల్లిని నాఫెడ్ ద్వారా సేకరించి నిల్వ చేసింది. వచ్చే నెలలో ఉల్లి ధరలు మరింత పెరిగిన పక్షంలో నిల్వచేసిన ఉల్లిని మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చి ధరను నియంత్రిస్తామని కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ, వినియోగదారులశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ఇప్పటికే ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచకుండా చూడటం, వారిపై నియంత్రణ చర్యలు చేపడితేనే ఉల్లి ధరలకు క్లెంపడే అవకాశం ఉంది. లేదంటే మున్ముందు వంటింట్లో ఉల్లి ఘాటు తప్పేలా లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనిని అధిగమించేందుకు బఫర్ స్టాక్ విడుదల చేసి, నల్లబజారుపై దాడులు చేయాలని సూచిస్తున్నారు.

# కడప వైసీపీలో కలవరం..!



కడప: వైసీపీ కంచుకోటలో పాగా వేసేందుకు కూటమి నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట. అసంతృప్తిగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లను కూటమిలోకి రావడానికి ద్వారాలు తెరిచారట.అయితే, కడప కార్పొరేషన్.. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ నుంచి నేటి వరకు వైఎస్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 2006లో కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ అయింది. దీనికోసం కడప పట్టణానికి సమీపంలో ఉన్న పలు గ్రామాలను మెర్జ్ చేశారు. దీంతో కమలాపురం నియోజకవర్గంలోని పలు గ్రామాలు.. కడప కార్పొరేషన్ లో విలీనం అయ్యాయి. ఆనాటి నుండి కడప ఎమ్మెల్యే తో పాటు కమలాపురం ఎమ్మెల్యేకి సంబంధించిన నేతలు కార్పొరేటర్లుగా గెలుపొందుతూ వస్తున్నారు. ప్రధానంగా కడప అసెంబ్లీ మొత్తం కార్పొరేషన్ పరిధిలోనే ఉంటుంది. కడప ఎమ్మెల్యే ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న కార్పొరేషన్ రెజల్యూషన్ తప్పనిసరి. 2004 నుంచి ఇప్పటివరకు కడప అసెంబ్లీలో టీడీపీ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు లేవు. 20 సంవత్సరాలు తర్వాత మొదటిసారిగా కడప, కమలాపురం రెండు నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేగా గెలుపొందారు.అంతేకాకుండా రాష్ట్రంలో కూడా టీడీపీ అధికారం చేపట్టడంతో ఆ ఇద్దరు ఎమ్మెల్యేల దృష్టి కడప కార్పొరేషన్ పై పడిందట. గత 20 సంవత్సరాలుగా వైసీపీ కంచుకోటగా ఉన్న కడప కార్పొరేషన్ పై తమ ఆధిపత్యం చెలాయించడం కోసం వైసీపీ కార్పొరేటర్లు కూటమిలోకి రావడానికి ఆ ఇద్దరు నేతలు ద్వారా తెరిచారట. కడప కార్పొరేషన్ లో 50 డివిజన్లు ఉన్నాయి. వాటిలో ఒక్క డివిజన్‌లో మాత్రమే టీడీపీ కార్పొరేటర్.. మిగతా 49 డివిజన్లలో వైసీపీ కార్పొరేటర్లు గెలుపొందారు. కరోనాకాలంలో ఒక్క కార్పొరేటర్ మృతి చెందారు. మేయర్ తో సహా 48 మంది కార్పొరేటర్లు వైసీపీకి చెందిన వారే. కడప ఎమ్మెల్యేగా మాధవి గెలిచిన అనంతరం రెండుసార్లు కడప కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తన మార్కు సాధించడం కోసం ఆమె కార్పొరేటర్ లను టీడీపీలోకి రావడం కోసం పావులు కదుపుతోందట వైసీపీలో అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్ లను తమ వైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారట.. అందులో భాగంగా 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణ.. వైసీపీని వీడి టీడీపీలో చేరారట. మరికొంతమంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరుతున్నారంటూ ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి కూడా తన నియోజకవర్గం లోని ఐదు మంది కార్పొరేటర్లతో మంతనాలు జరుపుతున్నారట.. వీరు కూడా త్వరలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటారని జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది.ఇదిలా ఉండగా మరో 6 మంది కార్పొరేటర్లు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారట. టీడీపీలోకి వారికి అనుమతి లేకపోవడంతో.. బీజేపీ పంచన చేరడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారట. బీజేపీ పెద్దలు కూడా కడప అసెంబ్లీలో పార్టీని బలోపేతం చేయడానికి కార్పొరేటర్ల చేరికకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మరి కొంతమంది కార్పొరేటర్లు జనసేన నేతలతో మంతనాలు జరుపుతున్నారట. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో తాము కూటమిలో చేరితే పనులు చక్కబెట్టుకోవచ్చని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారట. గత 20 సంవత్సరాలుగా వైసీపీలో ఉన్న కార్పొరేటర్లు నేడు పార్టీని వీడుతున్నవారిని అడ్డుకోవడంలో వైసీపీ అధిష్టానం విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.. ఏది ఏమైనా కడప కార్పొరేషన్ పై పట్టు సాధించడం కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు ముమ్మురంగా ప్రయత్నం చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 28న కాలినడకన తిరుమలకు జగన్

అమరావతి,వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలతో తిరుమల ఆలయ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను మంటగలిపారని పేర్కొంటూ వైసీపీ ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేపట్టాలని వైఎస్ జగన్ ట్విట్టర్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి వద్దకు మెట్ల మార్గాన వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైసీపీ పూజలకు పిలుపునిచ్చింది.

# ఆరు నెలలకే కథ రివర్స్.. అయోమయంలో కాటిపల్లి

హైదరాబాద్,ఆ నేత గెలుపు గత ఎన్నికల్లో సంచలనం. ఇద్దరు ముఖ్యమంత్రి అభ్యర్థులను ఓడించి.. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పార్టీ మేనిఫెస్టోతో సంబంధం లేకుండా సొంత స్కీమ్స్ ప్రకటించేశారా ఎమ్మెల్యే. 150 కోట్లు ఖర్చయినా సరే సొంత ఆస్తుల్ని అమ్మి అయినా.. నియోజకవర్గాన్ని నందనవనం చేస్తానని చెప్పారు. మరి, హామీలు అమలు చేశారా? ఆ దిశగా అడుగులు పడ్డాయా? త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ ఎమ్మెల్యే ఓన్ మ్యానిఫెస్టో ప్రతిపక్షాలకు అస్త్రంగా మారనుందా?బీజేపీ నేత, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి. గత ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఓడించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు రమణారెడ్డి. కానీ గత ఎన్నికల్లో మాత్రం ఇద్దరు ఉద్దండులను కాదని కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఆయనకు తొలిసారి అవకాశం ఇచ్చారు.కాటిపల్లిని ఎమ్మెల్యేగా గెలిపించడం వెనుక.. ఓ కారణం ఉందంటున్నారట నియోజకవర్గ ప్రజలు. ఎన్నికల వేళ ఏ ఎమ్మెల్యే అభ్యర్థి చేయని సాహసం చేశారట రమణారెడ్డి. నన్ను చూసి ఓటెయ్యండి, నా పథకాల్ని చూడండి అంటూ 150 కోట్లతో సొంత మ్యానిఫెస్టో ప్రకటించారట. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా 150 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారట. ప్రజలు సైతం ఆయన మాటలను నమ్మి గెలిపించారు. అయితే ఇప్పుడు 6 నెలల్లో హామీలను అమలు చేస్తానన్న ఎమ్మెల్యే.. 9 నెలలు గడిచిన ఏమి పట్టనట్టు సైలెంట్ గా ఉండడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ.. ఇప్పుడేమయ్యాయని ప్రశ్నలు సైతం వస్తున్నాయి. నియోజకవర్గం మొత్తం ఉచిత కార్పొరేట్ విద్య, వైద్యం.. ఉచిత శిక్షణ కేంద్రాలు, రైతులకు కల్లాల నిర్మాణం, క్రీడా ప్రాంగణాలు.. జనరల్ ఆసుపత్రులను నిర్మిస్తానని ఎన్నికల హామీలు ఇచ్చారట కాటిపల్లి. 150 కోట్ల రూపాయల సొంత నిధులతో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారట. తీరా ఇప్పుడు గడిచి ఇన్ని నెలలు అవుతుండడంతో.. ఇంత కాలం ఓపిక పట్టిన ప్రజలు.. ఇప్పుడు ఆ హామీలు సంగతేంటని ప్రశ్నించడానికి రెడీ అవుతున్నారని టాక్ నడుస్తోంది.ఈ పరిస్థితుల్లో సొంత పార్టీ క్యాడర్ సైతం.. కాటిపల్లి ఇచ్చిన హామీలు అమలు చేయడం సాధ్యమేనా అని చర్చించుకుంటున్నారట. నాడు ప్రభుత్వాలు చేసేదేంటి నన్ను గెలిపించండి.. అన్ని నేను చేసి చూపిస్తానన్న ఎమ్మెల్యే.. ఇప్పుడు మిన్నకుండడం పట్ల బీజేపీ నేతలు సైతం అయోమయంలో ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో.. 150 కోట్ల మ్యానిఫెస్టోపై




ప్రజల నిలదీస్తే ఏం సమాధానం చెప్పాలని తర్జనభర్జన పడుతున్నారట.గత అసెంబ్లీ ఎన్నికల్లో రమణారెడ్డి సొంత మ్యానిఫెస్టో బుక్ లెట్ ను విడుదల చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అదే బుక్ లెట్ తో ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ భావిస్తున్నట్టు సమాచారం అందుతోంది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రభుత్వం పై కాటిపల్లి విమర్శలు చేస్తే.. సెల్ఫ్ మ్యానిఫెస్టోను అంశంపై ప్రశ్నలు సంధించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఆస్తులు అమ్మైనా మ్యానిఫెస్టోను అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఏం చేశారని అధికార పక్షం సైతం నిలదీస్తారని మౌనం వహిస్తున్నారట.త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలను వేదికగా చేసుకుని బీజేపీని నిలదీయాలని.. కాంగ్రెస్ నేతలతో పాటు ప్రజలు సైతం సమాయత్తం అవుతున్నారని నియోజకవర్గం వ్యాప్తంగా జోరుగా చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యే కాటిపల్లిని ప్రశ్నించేందుకు రైతులు, విద్యార్థులు, యువత, ప్రజలు సిద్ధమవుతున్నారట. దీనిపై కాటిపల్లి, బీజేపీ నేతలు ఏం సమాధానం చెబుతారో అనేది సస్పెన్స్ గా మారింది.అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి చేసిన కామెంట్లతో కామారెడ్డి ప్రజలు అవాక్కవుతున్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అసలు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అనిపిస్తుందని .. రమణారెడ్డి వైరాగ్యంతో మాట్లాడడం పట్ల ప్రజలు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తమ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తారని నమ్మి.. ఎమ్మెల్యే పదవి కట్టబెడితే ఇలా మాట్లాడడం ఏంటని షాక్ అవుతున్నారట.మొత్తానికి సెల్ఫ్ మ్యానిఫెస్టోతో గ్రాండ్ విక్టరీ కొట్టిన కాటిపల్లి.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తారా ? ఎమ్మెల్యే మౌనం రానున్న ఎన్నికల్లో బీజేపీకి కష్టాలు తెచ్చిపెడుతుందా ? ఎమ్మెల్యే వ్యవహార శైలిపై ప్రజలు భగ్గుమనే టైం దగ్గర పడిందా అనే ప్రశ్నలు ప్రస్తుతం ఆసక్తిగా మారాయి.

# అజ్ఞాతవాసిలో ఆగ్రహ జ్వాల! శ్రీవారికి అపచారంపై మండిపాటు



విజయవాడ: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అవేశపరుడు. అతడొక చేగువేరా.. కమ్యూనిజానికి అభిమానే అయినా.. నాస్తికుడు కాదు, వాస్తవిక భావకుడు.. సర్వమానవ సమానత్వం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అందుకే పవన్‌లో పోరాడే తత్వంతో పాటు ఆధ్యాత్మిక చింతనా ఎక్కువే. గత ఎన్నికల్లో వారాహి యాత్ర చేపట్టారు. విజయం సాధించిన తర్వాత అమ్మవారి దీక్ష చేపట్టి తన భక్తిభావాన్ని చాటుకున్నారు. టీడీపీ, బీజేపీతో పొత్తులో భాగంగా ఏపీలో జనసేన పార్టీ 21 అసెంబ్లీ, 2 లోక్‌సభా స్థానాల్లో పోటీ చేసి, వందకు వంద శాతం విజయాలను అందుకుంది. అఖండ విజయం సాధించిన నేపథ్యంలో జూన్ 25 నుంచి వారాహి అమ్మవారి దీక్షను 11 రోజుల పాటు చేశారు. దీక్షలోభాగంగా కేవలం ద్రవాహారం, పాలు, పండ్లు, మంచినీరు మాత్రమే తీసుకున్నారు.

తిరుపతి వేంకన్నకు ప్రాయశ్చిత దీక్ష..

ప్రస్తుతం తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం యావత్ దేశాన్ని కుదిపేస్తోంది. హిందూ సమాజమంతా ఈ అపచారానికి ప్రాయశ్చితపడుతోంది. దీనికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాడానికి ఏపీ సర్కారు రెడీ అయ్యింది. విచారణకు సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)ను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా తిరుమల లడ్డూ కల్తీ ఘటనకు కదిలిపోయిన పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి దీక్ష ప్రారంభించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు..

పవన్ కళ్యాణ్ చేపట్టిన ఈ దీక్ష 11 రోజుల పాటు కొనసాగుతుంది అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకుని దీక్ష విరమించనున్నారు. తిరుమల లడ్డూలో కల్తీ నేపథ్యంలో ప్రాయశ్చిత్త దీక్షలో .. భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిలో పవన్ శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దుర్గమ్మ సన్నిధిలో మెట్లను శుభ్రం చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మెట్ల పూజ చేశారు. అనంతరం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన స్ఫూర్తితో జనసైన్యం పెద్ద ఎత్తున కదిలింది. తమ ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రాయశ్చిత్త పూజలు చేపట్టారు. జనసేనాని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమై.. యావత్ హిందువుల్లో మమేకమవుతుంటే దీన్ని కొంతమంది పొలిటికల్ స్టంట్‌గా చిత్రీకరించే యత్నం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ మౌనాన్ని పరీక్షిస్తున్నారు. ఫలితంగా ఆయనలో ఉగ్ర రూపం మెల్ల మెల్లగా బయటకు వస్తోంది.

పొలిటికల్ టర్న్..

తిరుమల వెంకన్న ప్రసాదం వ్యవహారంలో వైఎస్సార్సీపీ నేతల తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సహజ ఆవేశాన్ని వెళ్లగక్కారు. ఇందుకు కారణాలు కూడా ఉన్నాయి. లడ్డూ అపచారానికి సంబంధించి కల్తీ నెయ్యి వాడారని వైసీపీ పెద్దలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసాదాల్లో వాడింది స్వచ్ఛమైన నెయ్యి కాదని రిపోర్టులు కూడా స్పష్టం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అప్పట్లో నెయ్యికి బదులు జంతువుల నూనెలతో ప్రసాదం తయారు చేయించారని చంద్రబాబు ఆధారాలను బయటపెట్టారు. కాగా, ఈ వ్యాఖ్యలపై టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

మతపరమైన విభేదాలు..

కూటమి ప్రభుత్వం శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బ తీస్తోందని.. ఏదైనా తప్పు జరిగి ఉంటే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రచారాలు చేయొద్దని హితవుపలికారు. చేయని తప్పులకు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని రివర్స్ అటాక్ చేయడం ప్రారంభించారు. ఈ పొలిటికల్ వార్‌లోకి తాను సైతం అంటూ పార్ట్ టైమ్ పొలిటీషియన్, నటుడు ప్రకాశ్‌రాజ్ ఎంటర్ అయ్యారు. ఎక్స్ వేదికగా పవన్‌కళ్యాణ్‌ను ఉద్దేశించి పోస్టు పెట్టారు. మీరు ఉపముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో జరిగిన ఘటన కాబట్టి.. విచారించి నేరస్థులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనవసర భయాలు కల్పించి.. జాతీయస్థాయిలో చర్చించుకునేలా చేస్తున్నారని.. దేశంలో మతపరమైన ఉద్రిక్తలు రేకెత్తించొద్దని ట్వీట్ చేశారు.

తెలుసుకుని మాట్లాడాలి.. రెచ్చగొట్టొద్దు


హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా వ్యవహరించిన వారిపై ఎందుకు మాట్లాడకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఇంకో మతానికి సంబంధించి అంత అపరాదం జరిగితే ఊరుకునే వారా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌ని పొలిటికల్‌గా టార్గెట్ చేసి మాట్లాడిన పొన్నవోలు సుధాకర్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌పై డిప్యూటీ సీఎం ఫైర్ అయ్యారు. తగురీతిలోనే వారికి మాటలతో సమాధానం ఇచ్చారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రాయశ్చిత్త దీక్షలోని నాయకుడ్ని ప్రత్యర్థి రాజకీయ పార్టీలు రెచ్చగొడుతున్న వైఖరిపై జనసైనికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. కానీ, తమ సేనాని ఆజ్ఞానుసారం ప్రశాంత పరిస్థితికి కట్టుబడి ఉన్నారని.. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగేవని ప్రచారం జరుగుతోంది.

# పూరీ ఆలయానికి ఎపి సెగ ... నెయ్యి నాణ్యత తనిఖీకి నిర్ణయం

భువనేశ్వర్ : ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి దేవస్థానంలో కల్తీ ప్రసాదం వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించింది. ఈ నేపథ్యంలో పూరీ జగన్నాథ ఆలయంలో ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి నాణ్యతను పరీక్షించను న్నారు. ఈ మేరకు ఒడిశా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి దేవస్థానంలాగా ఇక్కడ ఎలాంటి ఆరోపణలు చేయలేదని పూరీ డీఎం సిద్ధార్థ్ శంకర్ స్వైన్ తెలిపారు. ఇక 12వ శతాబ్దానికి చెందిన ఆలయంలో భోగ్ (బోగ్) తయారీకి ఉపయోగించే నెయ్యి నాణ్యతను అధికారులు తనిఖీ చేస్తారు. ప్రభుత్వ యాజమాన్యంలోని ఒడిశా మిల్క్ ఫెడరేషన్ పూరీ ఆలయంలో ఉపయోగించే నెయ్యి సరఫరాదారు.

ఆలయ సేవకులతో కూడా చర్చలు

సిద్ధార్థ్ శంకర్ స్వైన్ మాట్లాడుతూ.. కల్తీకి సంబంధించిన ఏదైనా అవకాశాన్ని తొలగించడానికి, ఒడిశా మిల్క్ ఫెడరేషన్ ద్వారా సరఫరా చేయబడే నెయ్యి



ప్రమాణాన్ని తనిఖీ చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 'ప్రసాదం' సిద్ధం చేసే ఆలయ సేవకులతో కూడా దీనిపై చర్చిస్తామన్నారు. అలాగే భోగ్ - ప్రసాదం తయారీకి వినియోగించే అన్ని పదార్థాల నాణ్యత కూడా

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com